# వెధవ గొడవ

"శ్యామలా తువ్వాలేదీ" అని కేక వేశాడు ఆనందరావు.

"స్టాండుమీదే వుండాలండీ" అని తిరిగి కేక వేసింది పెరట్లో బాబిగాడికి వొళ్లు నలుస్తూ శ్యామల.

"ఎక్కడుందో ఏవిటో, గంటసేపట్నుంచి వెతుకుతున్నాను ఎక్కడా అవుపించదు వెధవ గొడవాని" అంటూ చిరాగ్గా మళ్ళీ గది అంతా కలియవెతకడం మొదలెట్టేడు ఆనందరావు.

"ఆనందరావుగారూ" అని వీథిలోంచి కేక.

"ఎవరు వారు?" అని విసుగ్గా అంటూ గది గుమ్మంలోంచే వీథి గుమ్మంకేసి చూశాడు ఆనందరావు.

"ఓ...నువ్వా బ్రదర్ మంచి టైముకే వచ్చేవ్ మరోసారి కనిపించు"

"అబ్బే మీకు జ్ఞాపకం చేద్దామని వచ్చాను. ఈ సారి తప్పకుండా యింటి పన్ను కట్టెయ్యాలి సుమండీ కమీషనరు మామీద కారాలు మిరియాలు నూరుతున్నాడు" అంటూ మర్యాదగా జారిపోయాడు బిల్లుకలెక్టరు.

"ఇందాకా బాబిగాడు తీసేడు నాన్నా. అది చుట్టబెట్టుకుని 'నేను నాన్నగారిని' అంటూ తిరిగేడు. వాడేం చేసేడో మరి" అంది పద్మ.

"వాడి తస్సాదియ్యా, ఏంరా బాబిగా ఏం చేసేవురా నా తువ్వాలు?" అంటూ పెరట్లోకి వెళ్ళేడు ఆనందరావు.

సగం నలిచిన వొంటితో తన చేతికి అందకుండా ఏడుస్తూ పారిపోతూన్న బాబిగాణ్ని తరమటం మానేసి ఆనందరావు కేసి ఒక్క చూపు చూసి విరగబడి నవ్వింది శ్యామల.

"అదేమిటండీ నడుముకు చుట్టబెట్టుకుని ఇల్లంతా వెతుకుతున్నారు!"

"అవును నాన్నా మరి ఇందాకా బాబిగాడిని ఆడించేటప్పుడు కట్టుకున్నావు కదూ" అంది పద్మ.

"ఊ...మహా చక్కగా జ్ఞాపకం చేసేరు. ఏమిటే శ్యామలా చిన్నపిల్లలా ఆ నవ్వులు. ఒసేవ్ పద్దీ ఆ వెకిలి నవ్వులు మానావా వీపు చిట్లగొట్టించమంటావా? నీళ్లు కాగేయేమో చూడు "శ్యామలా" అన్నాడు ఆనందరావు.

శ్యా : ఇవాళ దాసిది రాలేదు. ఇప్పుడే పొయ్యి అంటించాను. కాస్సేపుండండి.

ఆ : బాగుంది వరస అవతల ఇంటర్వ్యూకి టైము అయిపోతోంది. శ్రీమన్మహారాణీ దాసీ సుబ్బులుగారు దయచేయలేదంటే ఆగరు అక్కడ ఇంటర్వ్యూ చేసే పెద్దలు. అవునుగాని ఇవాళిటికి మూడు రోజులు నాగా. దాన్ని మానిపించేస్తే సరి, కుదురుతుంది.

శ్యా : ఆ. దానిమీటెల్లా వున్నా ముందు మనకి కుదురుతుంది. అయిందిగా భాగోతం ఇదివరకు. దాన్ని మానిపిస్తే ఇంకోళ్ళని ఇంటికి ఎక్కనిస్తుందా? స్వంతంగా చేసుకోలేక చావాలి. ఈ పనివాళ్లతో వేగలేక పోతున్నామమ్మా.

## నిట్టల శ్రీరామమూర్తి

"అబ్బ అపుచెయ్యి లెక్చరు. మళ్ళీ వచ్చి పోసుకుంటాను" అని నూతిదగ్గర మొహం తోముకుని యింట్లోకి వెళ్లేడు ఆనందరావు.

ఆ : అదేమిటి కొబ్బరినూనె అయిపోయినట్టుంది. చచ్చాంరా బాబూ, వొసే పద్దీ రంగయ్యకొట్టుకు వెళ్లి నూనె తీసుకురావే.

ప : ఇవాళ బుధవారం నాన్నా కొట్టుకు సెలవు.

"మై గాడ్" అనుకుంటూ కాసిన్ని నీళ్లతో జుట్టు తడిచేసుకుని దువ్వెన్నకోసం అన్వేషణ ప్రారంభించేడు ఆనందరావు.

"అద్దం వెనక అతిజాగ్రత్తగా పెటుకుంటే ఎవరు తీశారే శ్యామలా" అని కేక వేసేడు ఆనందరావు.

"అబ్బ వస్తున్నా వుండండీ ప్రతి దానికీ గందరగోళం చేసి పారేస్తున్నారు." అంటూ దొడ్డిఅంతా తిప్పి తన్ను కసరత్తు చేయించిన బాబిగాడివొళ్లు ఎల్లా అయితే నేం నలవటం పూర్తిచేసి సున్నిపిండి చేతులు కడుక్కుని యింట్లోకి వచ్చింది శ్యామల.

"ఈ దువ్వెన్నముక్క ఎక్కడెక తగలడిందో సీతాన్వేషణను మించిపోతోంది." అంటూ మళ్లీ డ్రాయరు వెదకటం ప్రారంభించేడు ఆనందరావు.

బాబిగాడు పెరట్లో శివతాండవం చేస్తున్నాడు అమ్మలేని ధీమా చూసుకుని. నీళ్ల పొయ్యిలోంచి పుల్లలు లాగెయ్యటం మొదలెట్టేడు.

"వెధవా, పొయ్యిదగ్గరకు వెళ్లకు" అని కేక పెట్టి అలమారు వెదుకుతోంది శ్యామల.

"అమ్మా పాలు పోయించుకోండమ్మా" అంటూ పాలమ్మి కేక.

"వొస్తున్నాను వుండవే వెధవగొడవాని" అంటూ శ్యామల వంటింట్లోకి వెళ్ళింది.

"ఇదిగో నాన్నా" అంటూ పెట్టె వెనకాతలనుంచి తీసింది పద్మ నవ్వుతూ.

"మొదటనే చెప్పలేకపోయావు టే" అని గదుముతూ దువ్వెన్న లాక్కున్నాడు ఆనందరావు.

"నువ్వు వెతుక్కోగలవో లేవో చూద్దామని నాన్నా" అని నవ్వుతూ చప్పట్లు చరుస్తూ 'నాన్నగారు ఫెయిలు అయిపోయారోయ్' అంటూ పెరట్లోకి వుడాయించింది పద్మ.

ఆ : "ఆహా దాని ఆకారం ఎంత సొంపుగా వుంది. అచ్చం మా తాత బోసినోరులాగే వుంది."


"బాబిగాడి పనే అది" అంటూ కొత్త గిన్నె పాలమ్మివద్దకు తీసుకువెళ్లింది శ్యామల.

"వాడు పెద్దైతే ఫస్టాసు డెంటిస్టు అయేటట్టున్నాడు వెధవాని" అంటూ తల దువ్వుకునేందుకు వుపక్రమించేడు ఆనందరావు.

"ఏమే బొత్తిగా నీరు పోస్తున్నావ్."

"అదేంటమ్మా అంత చిక్కగా పోస్తూంటే. కావలిస్తే, బుడ్డి వేసుకు

(56 పేజీ చూడండి)



# వెధవగోడవ

(25 వ పేజీ తరువాయి)

చూసుకోండి" అని పాలమ్మి దబాయింపు.

శ్యా: "మన మొహంమీకే కుళాయి దగ్గర చెంబులునింపి ఎల్లా దబాయిస్తోందో చూడండి."

"వాళ్లంతా అంతే యీ రోజుల్లో. వాళ్ల దబాయింపులకి మహా మహా ప్లీడర్లే చాలరు, మనమో లెక్కా" అంటూ దువ్వటం పూర్తిచేసి అద్దంలో మొహం వోసారి తనివితీరా చూసుకుని బట్టలపెట్టె తీసేడు ఆనందరావు.

ఆ: "అరె, ఒహ పంటామూ లేదే. చాకలి బట్టలుతీసుకెళ్లి యెన్నాళ్లైంది శ్యామలా ?"

"ఇరవైరోజులు దాటింది. అప్పుడే నాలుగుసార్లు కబురు చేసేం. ఇదుగో తెస్తున్నాం అదిగో తెస్తున్నాం అన్నమాటే కాని తేందే?" అంటూ బాబిగాడి పని పట్టడానికి పెరట్లోకి వెళ్లింది శ్యామల.

"ఇప్పుడు ఇంటర్వ్యూకి వెళ్లటం ఎలా వెధవగోడవాని. నిన్ననే తెస్తానన్నాడు కదా అని లాండరీకి వేసుకోలేదు" అంటూ పెళ్లినాటి ట్వీడు పంట్లాము తీసేడు ఆనందరావు. కోటు ఆ ముందురోజే తీసేడు. చొక్కా·కాస్త మాసింది. కోటుందిగా మరేం ఫరవాలేదు అనుకున్నాడు. రోహిణికార్తె. పూరికే చెమటలు కారిపోతున్నాయి. ఫాను రిపేరుకి వెళ్లింది. పెరట్లో బాబిగాడు ఏడుపు లంకించుకున్నాడు. పద్మ 'మేరే దిలియే పుకారే ఆజా' అంటూ ఆనందరావు బూడ్సు తుడవటం మొదలెట్టింది. ఆనందరావు డ్రెస్సు వేసుకుని యివతలికి వూడి పడేసరికి మంగలివీరడు చేతులు నలుపుకుంటూ నవ్వుతో, కిటికీదగ్గర ప్రత్యక్షమయ్యాడు 'మొన్నటి సవరం డబ్బులు బాబూ' అంటూ.

"ఉండేరా బాబూ, ముందు నాపని తువరమయ్యేటట్లు వుంది. ఇప్పుడు చిల్లర లేదు మళ్లీరా" అంటూండగానే పూర్ణయ్యగారు రావటం కుర్చీలో కూర్చోటం జరిగింది.

పూ: ఇదిగో చూడు ఆనందం ! శుభలేఖ బల్లమీద పెట్టాను. రేపు రాత్రి సరిగ్గా వంటిగంటా తొమ్మిది నిమిషాలకి తప్పకుండా రావేం, శ్యామల పిల్లలూ అంతా రావాలి సుమా మర్చిపోయేవుగనక"

"ఓ తప్పకుండాను. అంతకన్నానా" అంటూ 'ఇహ సెలవిప్పించండి' అన్నట్లు నమస్కారం పెట్టేడు ఆనందరావు.

"పిల్లలూ నువ్వూ అంతా రావాలి. మళ్లీ మళ్లీ పిలవలేదనుకోకు" అంటూ కుర్చీలోంచి లేచి,

"శ్యామలమ్మా మీ ఆయనతో చెప్పేను తప్పకుండా రా" అని మెట్లు దిగుతూ "ఏమోయ్ ఆనందం అమ్మాయిని పిల్లల్ని తీసుకురా సరిగ్గా రాత్రి వంటిగంటా తొమ్మిది నిమిషాలకి" అని హెచ్చరిస్తూ వెళ్లిపోయారు పూర్ణయ్యగారు. ఆనందరావు అల్లాగే అన్నట్లు బుర్రవూపి ఓసారి చేతి వాచీ చూసుకొని వీధి అటూ ఇటూ పరకాయించి చూసేడు. ఒక్క రిక్షాకూడా కనిపించలేదు.

"ఒసే పద్మా రిక్షావాణ్ణి కేకవేయవే" అన్నాడు.

"పద్మని ఇప్పుడే కాంతంగారి యింటికి పంపించాను కుంకుడుకాయలకోసం" అంది శ్యామల కుంకుడుకాయలు కొట్టే రాయి కోసం వెతుకుతూ.

ఇంతలో ఓ రిక్షా తను యింటికేసే వస్తూంటే చూసి 'అమ్మయ్య' అన్నాడు ఆనందరావు.

"అరే అందులో మనుష్యులున్నారే?"

రిక్షా ఆనందరావు యింటిదగ్గర ఆగింది. పద్మ కుంకుడుకాయలు తెస్తూ రిక్షాని చూసి, "అమ్మా శంకరంమామయ్య వాళ్లూ వచ్చేరే" అని కేక వేస్తూ ఇంట్లోకి పరుగెత్తింది.

ఆనందరావు నీరసంగా చిరునవ్వు నవ్వి తెచ్చిపెట్టుకున్న ఉత్సాహంతో "ఏమోయ్ ఎప్పుడు వచ్చేవ్" అని పలకరించేడు బావమరదిని.

"ఇదిగో వస్తున్నాముగా యిటే రాక" అంటూ సామాన్లు లోపల పెడుతున్నాడు శంకరం.

'ఆనందం మామయ్యా' అంటూ శంకరం రెండోవాడు ఆనందరావు కాళ్లు పట్టుకుని వేళ్లాటం మొదలెట్టేడు. ట్వీడ్ పాంటు నలిగిపోతున్నందుకు మనస్సులో యమయాతన పడుతూ పైకి నవ్వుమొహం పెట్టి, జలగలా పట్టుకున్న వాణ్ణి ఓసారి యెత్తుకుని దింపివేసి "ఏయ్ రిక్షా వుండు వస్తున్నా" అని చిల్లర కోసం పర్సుతో కుస్తీ పడుతున్న శంకరంతో

"ఇంటర్వ్యూకి వెళ్తున్నా నీ చెల్లెలు లోపలవుంది." అని శంకరం అడగబోయే కుశలప్రశ్నల్ని ఆపుజేసి, రిక్షాయెక్కేడు ఆనందరావు. రిక్షా రెండుబారలు నడిచిందో లేదో "నాన్నా పెన్ను మర్చిపోయావు" అంటూ పద్మవచ్చి పెన్నుయిచ్చింది. ఆనందరావు ఆలస్యమైందేమో అని టైము చూసుకునే సరికి వాచీ ఆగిపోయివుంది. "పద్మా ప్లీడరుగారింటికి వెళ్ళి టైము చూసిరావే" అన్నాడు. పద్మ పరుగుతో వెళ్ళివచ్చి "నాన్నా వాళ్ళ గోడగడియారం ఆగిపోయిందట" అంది... వీధి మలుపు తిరక్కుండానే రిక్షా బ్రహ్మాండమైన శబ్దముతో ఆగిపోయింది.

"టైరుపోయింది సార్" అన్నాడు రిక్షావాడు.

"అయితే ఈ డ్యూటీనుంచి రిటైరు అవు" అంటూ కైరైన మొహంతో ఆనందరావు బస్సుస్టాండుకేసి నడక సాగించేడు. అరఫర్లాంగు వెళ్ళేసరికి బస్సు వచ్చేసింది. ఆపమంటూ పరుగెత్తుకుంటూ వెళ్ళేడు. "ఖాళీ లేదు సార్, పోబా రైట్" అన్నాడు కండక్టరు.

ట్వీడ్ సూటులో కుమిలిపోతున్నాడు ఆనందరావు. టైము పూరికే ఖర్చు అయిపోతోంది దానకర్ణుడి చేతిలోని ధనంలా. ఇంటర్వ్యూ టైము అయిపోతోందో ఏమిటో? ఆనందరావుకి లోపల తేళ్లూ జెర్రులూ పాకినట్లుంది. ఎంతకీ బస్సు రాదు. "అమ్మయ్య బస్సు వచ్చింది." అని బస్సు ఎక్కుతూవుంటే "నాన్నా" అంటూ పద్మ కేక వేసుకుంటూ వస్తోంది. "వెధవగోడవాని" అంటూ ఆగిపోయాడు ఆనందరావు.


"ఏమే ఏం కొంప మునిగింది?"

"మామయ్యవాళ్ళొచ్చారు కదూ నాన్నా! అమ్మ బియ్యం అవి తీయాలని చెప్పమంది" అంది పద్మ వగర్చుకుంటూ.

"ఆరి భగవంతుడా" అని జేబులు తడుముకున్నాడు. చిల్లర డబ్బులు మాత్రం తగిలాయి. బస్సువచ్చేస్తోంది. ఫ్రెండు పరమయ్య జ్ఞాపకం వచ్చాడు.

"పద్దీ పరమయ్య మామయ్య దగ్గరకు వెళ్ళి నేను ఇమ్మన్నానని చెప్పి పది రూపాయలు తీసుకో" అంటూ బస్సు ఎక్కేడు.

ఇంటర్వ్యూ హాలులోకి వెళ్ళేసరికి తన పేరే పిలుస్తున్నారు. నుదుటినుంచీ, చెంపలనుంచీ కారే చెమటని జేబురుమాలుతో తుడుచుకొని, టైసర్దుకొని, క్రాపు వేళ్ళతో సరిజేసుకుని, ఉద్వేగంతో కొట్టుకునే గుండెలతో, తెచ్చిపెట్టుకున్న ధీమాను సూచించే బలవంతపు చిరునవ్వుతో ఇంటర్వ్యూ రూములోపల అడుగుపెట్టాడు ఆనందరావు. ★


నారసింహ లేహ్యము

బంగారుతో చేరినది. మేహము పిక్కాక, విస్మృత్తువ వగైరా హరించి బలము రక్తవృద్ధి కల్గించును. 20తు. డబ్బి రు. 3-4-0 పోస్టేజి అ 15.

పి. సి. పి. అండ్ కో, (ఆయుర్వేద సమాజం)

పెరిదేపి, (పోస్టు) నెల్లూరు జిల్లా.



Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.